ప్రజాశక్తి

శనివారం 13 డిసెంబర్ 2025

5

విజయనగరం

నేడు 'సెంచూరియన్' స్నాతకోత్సవం

ప్రజాశక్తి-నెల్లిమర్ల

సెంచూరియన్ విశ్వవిద్యాలయ ఐదో స్నాతకోత్సవ వేడుకలను శనివారం నిర్వహిస్తున్నట్లు ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ డి.ఎన్.రావు తెలిపారు. శుక్రవారం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్నాతకోత్సవ వేడుకలకు యుపిఎస్ఎస్ఎస్సి చైర్మన్ సత్యనారాయణ్ సబాత్, బిసిబిసిఐ ప్రుడెన్సియల్ ఎఎంసి సిఐఒ శంకరన్ నరేన్ హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమానికి చాన్సలర్ జిఎస్ఎన్ రాజు అధ్యక్షత వహించనున్నారని చెప్పారు. వైస్‌చాన్సలర్ ప్రశాంతకుమార్ మహంతి మాట్లాడుతూ 409 మంది విద్యార్థులకు డిగ్రీలు, ఆరుగురికి పిహెచ్‌డిలు ప్రదానం చేస్తామన్నారు. మరో ఇద్దరికి గౌరవ డాక్టరేట్లు అందిస్తామని చెప్పారు. వివిధ కేటగిరీలలో 14 బంగారు పతకాలు, మరో 8 మందికి నగదు ప్రోత్సాహకాలు అందజేస్తామన్నారు. సమావేశంలో రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన అంగన్వాడీలు

అంగన్వాడీల ఆగ్రహం

- కలెక్టరేట్ వద్ద భారీ ధర్నా
- జాతీయ రహదారిపై మానవహారం
- కనీస వేతనాలు, హామీలు అమలుకు డిమాండ్
- సమస్యలు పరిష్కరించే వరకు పోరాడుతాం
- అంగన్వాడీ యూనియన్ నాయకులు
- పోలీసులకు, నాయకులకు మధ్య స్వల్ప వాగ్వివాదం

ప్రజాశక్తి-కంటోన్మెంట్

కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసి తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన అంగన్వాడీలు శుక్రవారం కలెక్టరేట్ వద్ద భారీ ఆందోళన చేపట్టారు. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన అంగన్వాడీలు కలెక్టరేట్ వద్ద చేపట్టిన ధర్నాతో ఆ ప్రాంతమంతా నినాదాలతో మార్మోగింది. వందలాదిగా వచ్చిన అంగన్వాడీఆలు కలెక్టరేట్ మెయిన్‌గేట్ వద్ద బైఠాయించడంతో ఉద్యోగులు లోపలకు వెళ్లేందుకు ఆటంకం కలిగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలైనా అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని నినదించారు. ధర్నా వద్దకు అధికారులు ఎంతకూ రాకపోవడంతో విజయనగరం టూ టౌన్ సిఐ టి.శ్రీనివాసరావు, రూరల్ సిఐ లక్ష్మణరావు అంగన్వాడీ సంఘం నాయకులను, సిఐటియు నాయకులను కోరారు. ఐసిడిఎస్ పీడీ వచ్చి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇస్తే ధర్నా విరమిస్తామని నాయకులు తెలిపారు. ఈ సమయంలో సిఐటియు నాయకులకు పోలీసులకు మధ్య స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసు అధికారులు అసిస్టెంట్ ఐసిడిఎస్ అధికారి తవిటినాయుడును ధర్నా వద్దకు రప్పించారు. పీడీ తమ వద్దకు వచ్చి సమస్యలు పరిష్కరిస్తే గాని ఇక్కడి నుంచి కదిలేది లేదని అంగన్వాడీలు భీష్మించారు. చివరకు పోలీసులు నాయకులను ఒప్పించడంతో తవిటి నాయుడుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి టివి రమణ మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలను పరిష్కరించేంతవరకు ఈ ఉద్యమం ఆగదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి 18నెలలు అవుతున్నా అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను ఒక్కటి కూడా అమలు చేయ లేదని మండిపడ్డారు. ఐసిడిఎస్ పీడీ అంగన్వాడీల ధర్నా వద్దకు వచ్చి వినతి పత్రం తీసుకోవడానికి ఎందుకు రాలేదని ప్రశ్నించారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు వి.లక్ష్మీ మాట్లాడుతూ అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలన్నారు. అన్ని యాప్‌లు కలిపి ఒక యాప్‌గా మార్చాలన్నారు. రాష్ట్రంలో పేద గర్భిణీలు, బాలింతలు, చిన్న పిల్లలకు అంగన్వాడీలు అనేక సేవలు అందిస్తున్నారని తెలిపారు. అయినప్పటికీ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా 2019 నుండి అంగన్వాడీలకు వేతనాలు పెరగలేదన్నారు. 2023 డిసెంబర్లో నలభై రెండు రోజుల పాటు సమ్మె నిర్వహించామని, సమ్మె సందర్భంగా జూలైలో అంగన్వాడీలకు కనీస వేతనాలు పెంచుతామని, ఇతర సమస్యలు పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చి నేటి వరకు అమలు చేయలేదన్నారు. విజయనరం జిల్లాలో 170 మంది మినీ వర్కర్లను ఇప్పటికీ మెయిన్ వర్కర్లుగా మార్చలేదన్నారు. సంక్షేమ పథకాలు అమలు కావడం లేదన్నారు. రాజకీయ ఒత్తిడి వలన రాజాం ప్రాజెక్టులో నలుగురు హెల్పర్లకు ప్రమోషన్ ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.అనసూయ మాట్లాడుతూ గ్రాడ్యుటీ అమలుకు గైడ్‌లైనున్స్ రూపొందించాలన్నారు. వేతనంతో కూడిన మెడికల్ లీవ్ ఇవ్వాలన్నారు. ప్రీ స్కూల్ బలోపేతం చేయాలని, ప్రీస్కూల్ పిల్లలకు తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న 164 సూపర్‌వైజర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.పైడిరాజు, సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.సురేష్, నాయకులు సిహెచ్ రూపావతి, జి.అరుణ, జి.సరళ, టి.మాలతి, ఎ.ఉషారాణి, ఎం.కృష్ణ, జి.చిట్టితల్లి తదితరులు పాల్గొన్నారు.

భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు

కలెక్టరేట్ వద్ద అంగన్వాడీల ధర్నా నేపథ్యంలో పోలీసులు భారీగా మోహరించారు. బొబ్బిలి డిఎస్పి భవ్య రెడ్డి, విజయనగరం వన్ టౌన్ సిఐ అర్‌విఆర్‌కె చౌదరి, టూటౌన్ సిఐ టి.శ్రీనివాసరావు, విజయనగరం రూరల్ సిఐ లక్ష్మణరావు, ట్రాఫిక్ సిఐ నాయుడు, వైకుంఠరావు, ఎస్సైలు సంభాన రవి, ఎం.కృష్ణమూర్తి, అశోక్ కుమార్, రావాడ జయంతి, సన్యాసినాయుడు, పలువురు ఎఎస్ఐలు, హెచ్‌సిలు, మహిళా కానిస్టేబుళ్లు అధిక సంఖ్యలో బందోబస్తు నిర్వహించారు.

మానవహారం నిర్వహిస్తున్న అంగన్వాడీలు

సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ విజయలక్ష్మి

రూ.158.27 కోట్లతో బడ్జెట్

స్టాండింగ్ కమిటీ ఆమోదం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

2026-27 ఆర్థిక సంవత్సరానికి నగర పాలకసంస్థ స్టాండింగ్ కమిటీ రూ.158కోట్ల 27లక్షల 6,500తో బడ్జెట్‌ను ఆమోదించింది. శుక్రవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ బడ్జెట్‌లో సుమారు 69.77కోట్ల రూపాయలతో నగర అభివృద్ధి పనులుకు నిధులు కేటాయించారు. రూ.7.50 కోట్ల సాధారణ నిధులతో కొత్తగా రోడ్లు వేసేందుకు, రూ.2.50కోట్ల బిపిఎస్ నిధులతో అభివృద్ధి పనులు, రూ.12 కోట్లు 15వ ఆర్థిక సంఘం నిధులతో అభివృద్ధి పనులు, రూ కోటి రూపాయలతో సచివాలయాల పక్కా భవనాలు నిర్మాణాలు, కోటి రూపాయలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు నిర్మాణం, కోటి రూపాయలతో హార్టికల్చర్, నగర సుందరీకరణ, రూ.4 కోట్ల సాధారణ నిధులుతో మురుగు కాలువలు నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. కోటితో సెంట్రల్ లైటింగ్, పార్కుల లైటింగ్, జంక్షన్ లైటింగ్, కోటిరూపాయలతో పార్కులు, ప్లే గ్రౌండ్‌ల అభివృద్ధి పనులు, రూ.75లక్షలతో కమ్యూనిటీ టాయిలెట్స్ నిర్మాణం, రూ.2కోట్లతో నీటి సరఫరా పైపులైన్లు ఏర్పాటు చేసేందుకు కేటాయించారు. రూ.43కోట్లతో కొత్త షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం, కోటి రూపాయలతో ట్రాఫిక్ సిగ్నల్స్ అభివృద్ధి చేయనున్నారు. రెవెన్యూ ఆదాయం రూ.39 కోట్ల 69లక్షల 70వేలుగా అంచనా వేశారు. ఖర్చు రూ.18.63కోట్లలో పట్టణ ప్రణాళిక విభాగం ద్వారా ఆదాయం రూ.16.25కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని రకాల గ్రాంట్లు కలిపి రూ.22కోట్ల 5లక్షలు, .డిపాజిట్లు, మరియు అడ్వాన్సులు కింద రూ,5,38,56,500కోట్లు, సాధారణ పరిపాలన విభాగానికి రూ.5,39,80,000 కోట్లు, ప్రజారోగ్య శాఖ ద్వారా జరుగు అన్ని రకాలు ఖర్చుకు,వేతనాలు మరుగుదొడ్లు నిర్వహణ, పారిశుధ్య పనులు,వాహనాలు మరమ్మత్తులు , అన్ని రకాలు సేవలకు గాను రూ.31,65,00,000 కోట్లు బడ్జెట్‌లో కేటాయింపులు చేశారు. మొత్తంగా వచ్చే ఆదాయం, ఖర్చు కలిపి అన్ని రకాలు పద్దులు రూ.158,27,06,500 కోట్లతో ఆమోదించారు.

ఆదాయం పెరిగే మార్గాలపై దృష్టిసారించాలి

నగర పాలక సంస్థకు ఆదాయం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ఫ్లోర్ లీడర్ రాజేష్ కోరారు. రోడ్డు కటింగ్ ఛార్జీలు వసూలు చేయాలని, వాటిని స్క్రాప్ కొట్టుకు అమ్మడం ద్వారా ఆదాయం వస్తుందని, దానిపై దృష్టి సారించాలని కోరారు. హోటళ్ల నుంచి వచ్చే చెత్తకు పన్ను వేయడం ద్వారా ఆదాయం పెరుగుతుందన్నారు. అద్దెలు పెంచి, ఖాళీ స్థలాలు మీద పన్నులు వేయడం ద్వారా ఆదాయం పెంచాలని సూచించారు. నీటి కుళాయిలు పన్నులు చాలా ప్రాంతాల్లో వసూలు చేయడం లేదని, వాటిపై దృష్టి సారించాలని కోరారు. మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ నగరాభివృద్ధికి తోడ్పడే బడ్జెట్‌కు రూపకల్పన చేసిన సిబ్బందికి, అధికారులకు అభినందనలు తెలిపారు. సమావేశంలో కమిషనర్ పి.నల్లనయ్య, స్టాండింగ్ కమిటీ సభ్యులు సుంకరి బాబు, రంగా, అర్.రూపవతి, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, ప్రజారోగ్య, గణక శాఖ, రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నిధుల స్వాహా వాస్తవమే

- బ్యాంకు కరస్పాండెంట్, విఒఎ సూత్రధారులు
- రూ.43.44 లక్షలు రికవరీకి సిఫార్సులు
- విచారణలో తేల్చిన డిఆర్‌డిఎ అధికారులు
- 'ప్రజాశక్తి' కథనాలకు స్పందన

తునివాడలో మహిళా సంఘాలతో విచారణ చేపడుతున్న డిఆర్‌డిఎ అధికారులు

ప్రజాశక్తి-రేగిడి

మండలంలోని తునివాడ గ్రామంలో బ్యాంకు కరస్పాండెంట్ అల్లు శ్రీధర్, ఆయన భార్య, వెలుగు విఒఎ అరుణకుమారి కలిసి నిధులు స్వాహా చేశారని డిఆర్‌డిఎ అధికారులు, బ్యాంకు లింకేజీ జిల్లా ఎపిఎం ఎ.లక్ష్మునాయుడు, డిపిఎంఐబి ఎ.చిరంజీవి తేల్చారు. నిధుల స్వాహాపై ఇటీవల 'ప్రజాశక్తి'లో ప్రచురితమైన వరుస కథనాలకు, మహిళా సంఘాల ఆందోళనకు అధికారులు స్పందించారు. ఈ మేరకు శుక్రవారం తునివాడ గ్రామంలో మహిళా సంఘాలతో విచారణ చేపట్టారు. 2018 నుంచి మహిళా సంఘాల రికార్డులు పరిశీలించగా, 39 సంఘాల వద్ద రూ.43.44 లక్షలు స్వాహా చేసినట్లు తేలిందని వివరించారు. మహిళా సంఘాలు బ్యాంకులకు చెల్లించాల్సిన నగదు తీసుకొని, బ్యాంకులకు కట్టకుండా, రశీదులు ఇవ్వడం నిధులు కాజేసినట్లు రుజువైందని స్పష్టంచేశారు. బయోమెట్రిక్‌లో వేలిముద్రలు పడినా.. పడనట్లు నటించి, సిగ్నల్ సమస్యని చెప్పి డబ్బులు కాజేశారని చెప్పారు. గ్రామానికి చెందిన మహిళా సంఘాల సభ్యులు సంబంధిత రేగిడి యూనియన్ బ్యాంకుకు రుణాలు, పొదుపులు కట్టేందుకు వెళితే ఆ బ్యాంకర్లు కట్టనివ్వకుండా బ్యాంకు కరస్పాండెంట్ కలిసి గ్రామంలో కరస్పాండెంట్ శ్రీధర్‌కు కట్టాలని తిరిగి పంపించడం స్వాహాకు కారణమని విచారణలో తెలిసిందన్నారు. నిధుల రికవరీకి సిఫార్సు చేసినట్లు వివరించారు. వీరితోపాటు ఎపిఎం బాసిన గోవిందరావు, స్త్రీనిధి మేనేజర్ సుధాకర్ ఉన్నారు.

కుంటిసాకులతో మిల్లు మూసివేత దుర్మార్గం

ప్రజాశక్తి-నెల్లిమర్ల

జ్యూట్ యాజమాన్యం కుంటి సాకులు చూపించి మిల్లు మూసివేయడం తగదని జ్యూట్‌మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కిల్లంపల్లి రామారావు అన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో జ్యూట్ యాజమాన్యం మిల్లులో అగ్ని ప్రమాదం జరిగిందని మిల్లు మూసివేస్తున్నట్లు ప్రకటించిందని తెలిపారు. యాజమాన్యం అక్రమ లాకౌట్ తర్వాత మిల్లు తిప్పి 10 మాసాలు మాత్రమే అయిందని, ఇంతవరకు పిఎఫ్, ఇఎస్ఐ, గ్రాట్యుటీ బకాయిలు చెల్లించలేదని తెలిపారు. ప్రస్తుతం అగ్నిప్రమాదం జరిగిందని కుంటి సాకు చూపించి మిల్లు మూసివేయడం దుర్మార్గమన్నారు. సంక్రాంతి పండగ ముందు అర్ధాంతరంగా మిల్లు మూసి వేస్తే కార్మిక కుటుంబాలు రోడ్డున పడతాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఎమ్మెల్యే లేబర్ అధికారులు వెంటనే స్పందించి మిల్లుని తిప్పించడానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొత్స నారాయణ, కె.పద్మనాభం పాల్గొన్నారు.

ప్రాజెక్టుల ఏరియల్ సర్వే

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఉత్తరాంధ్రలో నిర్మితం అవుతున్న వివిధ ప్రాజెక్టుల పురోగతిని స్వయంగా చూసేందుకు సిఎం చంద్రబాబు శుక్రవారం ఏరియల్ సర్వే నిర్వహించారు. విశాఖలోని పలు నిర్మాణాలతో పాటు భోగాపురం ఎయిర్ పోర్టు, రాయ్ పూర్ విశాఖ జాతీయ రహదారి, తీర ప్రాంతంలోని రహదారులు, కనెక్టివిటీ ప్రాజెక్టుల గురించి అధికారులతో చర్చించారు. పలు సాగునీటి ప్రాజెక్టులను ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించారు.

ప్రజాదర్బార్‌కు 600 అర్జీలు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమానికి సుమారు 600 అర్జీలు అందాయి. అర్జీలను అందజేసేందుకు ప్రజలు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి మాట్లాడుతూ ప్రజలు వ్యయప్రయాసలకోర్చి నిత్యం కార్యాలయాల చుట్టూ తిరగకుండా నియోజకవర్గ స్థాయితోపాటు ఎక్కడికక్కడ మండల కేంద్రాల్లో తమ సమస్యలు తెలియజేసే అవకాశాన్ని కల్పిస్తున్నామన్నారు. ప్రజల నుంచి ఇళ్ల, ఇళ్ల స్థలాలు, ఇళ్లస్థలాల క్రమబద్ధీకరణ, భూ సమస్యలు, రైస్ కార్డులు, ఉపాధి, పింఛన్లు, డ్రెయిన్లు, వికలాంగుల సర్టిఫికెట్లు, తదితరాలతో పాటు వివిధ రెవెన్యూ సేవలకు సంబంధించి అర్జీలు వచ్చాయని, తక్షణ పరిష్కారానికి అధికారులను ఆదేశించామని తెలిపారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి వచ్చిన సత్యనారాయణ, కొప్పలవెలమ కార్పొరేషన్ డైరెక్టర్ మాకిరెడ్డి శ్రీలక్ష్మి, దాసరి కార్పొరేషన్ డైరెక్టర్లు నానిగిరి రామనాజీ, గనివాడ బంగారు నాయుడు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, మండల అధ్యక్షులు డోకుల అచ్చెన్నాయుడు, ఎంపిపి సండి సోమేశ్వరరావు, వైస్ ఎంపిపి ఇందుకూరి సుధారాణి, ప్రధాన కార్యదర్శి కొట్యాడ జగదీష్, సర్పంచ్ గనివాడ సంతోషి కుమారి, ఎంపిటిసిలు మజ్జి దేవి, వాకాడ సింహాచలం, తహశీల్దార్ శ్రీనివాసరావు, ఎంపిడిఒ సతీష్, తెలుగు యువత మండల అధ్యక్షులు వాకాడ బాలు, ఐటిడిపి ప్రతినిధి చక్కా కిరణ్ పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

ఎమ్మెల్యే ప్రజాదర్బార్‌కు వినతుల వెల్లువ

విజయనగరంకోట : స్థానిక ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మి శుక్రవారం టిడిపి కార్యాలయంలో ఆశోక్‌బంగ్లాలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో పలువురు తమ సమస్యలు పరిష్కరించాలని వినతులు అందజేశారు. జిల్లా రజకుల సంక్షేమ సంఘం నాయకులు రజకులకు దోబిఖానా, షెడ్ల ఏర్పాటుకు, ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షులు ముత్యాలు పైడ్రాజు, కార్యదర్శి మద్ది పైడిరాజు, జాయింట్ సెక్రెటరీ కొత్తకోట శ్రీను ఐక్యవేదిక అధ్యక్షులు సత్యం, అచ్చన్న నాగరాజు పాల్గొన్నారు. 23వ డివిజన్ కి చెందిన జామి శ్యామల పుట్టుకతోనే వినికిడి సమస్యతో బాధపడుతుండడంతో తనకు పింఛను ఇప్పించాలని వినతి అందజేసింది. తన తల్లి ఔట్సోర్సింగ్ ఉద్యోగం చేయడంతో పింఛను ఇవ్వడం లేదని, సిఎఫ్ఎంఎస్ నుంచి తన పేరును తొలగించి కూతురికి పెన్షన్ ఇప్పించాలని కోరింది. వైయస్సార్ కాలనీకి చెందిన కె.హేమలత విడో పెన్షన్ ఇప్పించాలని కోరింది. తన తల్లి కార్డులో మ్యాపింగ్ అవ్వడంతో తనకు పెన్షన్ రావట్లేదని తెలిపింది. ఆ మ్యాపింగ్ నుంచి తొలగించి పెన్షన్ ఇప్పించని కోరింది. మొత్తంగా 20 మంది తమ సమస్యలు పరిష్కరించాలని వినతులు అందజేశారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు గంటా పోలినాయుడు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, కుటుంబరావు, చొప్ప రామారావు, మజ్జి రాజు, నియోజకవర్గ టిడిపి నాయకులు పాల్గొన్నారు.

వినతులు స్వీకరిస్తున్న విజయనగరం ఎమ్మెల్యే అదితి

14 నుంచి మెగా ట్రేడ్ ఫెయిర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఈనెల 14 నుంచి మూడు రోజులు పాటు రింగ్‌రోడ్డులోని లీపారాడైజ్‌లో ఎగ్జిబిషన్ తరహా మెగా ట్రేడ్‌ఫెయిర్‌ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం ఓ ప్రైవేట్ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ట్రేడ్ ఫెయిర్ నిర్వాహకులైన ఎన్నారై హాస్పిటల్ డైరెక్టర్ డి.రమేష్ కుమార్ మాట్లాడారు. ఈ ఫెయిర్ ప్రధాన ఉద్దేశం సుమారు 100కు పైగా ప్రొడక్ట్స్‌ను ప్రదర్శిస్తారని తెలిపారు. ప్రస్తుతం ఆన్‌లైన్ మోసాలకు గురవుతున్న ప్రజలకు అవగాహన కల్పిస్తూ మన విజయనగరం దగ్గరే ఎయిర్ పిన్ నుంచి హెల్త్ కేర్ వరకు, ఐరన్ స్టీల్, మెడికల్ క్లాత్స్, డ్రై ఫ్రూట్స్, కూరగాయలు, చిన్న పిల్లల ఆట వస్తువులు ఇలా మెగా డిస్కౌంట్స్‌తో ఈ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానిక వ్యాపారస్తులను సపోర్ట్ చేయడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆరిశెట్టి ముఖేష్ మాట్లాడుతూ అన్ని వర్గాలకు సంబంధించిన వస్తువులు ఎక్కడ దొరుకుతాయని అన్నారు. లక్ష్మీ ట్రైర్స్ బొడ్డు రాకేష్ మాట్లాడుతూ స్థానిక వ్యాపారస్తులను సపోర్ట్ చేయడానికి ఈ మెగా ట్రేడ్ ఫెయిర్ నిర్వహిస్తున్నామన్నారు. శైల ఫుడ్స్ అధినేత గ్రంధి తేజ మాట్లాడుతూ ప్రతి గంటకు లక్కిడీప్ ద్వారా 1500 నుంచి 2000 రూపాయలు వరకు క్యాష్ ప్రైస్ ఇస్తామని తెలిపారు.

లేబర్ కోడ్‌లతో ప్రమాదం

ప్రజాశక్తి-విజయనగరంకోట

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్‌కోడ్‌లతో కార్మికులకు ప్రమాదం ముంచుకువస్తుందని ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ప్రమోద్ కుమార్ అన్నారు. యూనియన్ జోనల్ వర్కింగ్ కమిటీ మహాసభలు విజయనగరం లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విజయనగరం రైల్వేస్టేషన్ నుండి రైల్వే ఇనిస్టిట్యూట్ వరకు భారీ ర్యాలీని నిర్వహించారు. జోనల్ అధ్యక్షులు ఆర్‌విఎస్ఎస్ రావు, విశాఖపట్నం డివిజనల్ కోఆర్డినేటర్ పి..రామ మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు. రైల్వే స్టేషన్ నుంచి ప్రధాన రహదారి మీదుగా ర్యాలీ సాగింది. అనంతరం జరిగిన వర్కింగ్ కమిటీ సమావేశంలో ప్రధాన కార్యదర్శి ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్ ను తీవ్రంగా వ్యతిరేకించాలని అన్నారు. ప్రధాన అతిథిగా హాజరైన వాల్తేరు డివిజన్ ముఖ్య కార్మిక అధికారి కబీర్ అన్సారిని ఘనంగా సన్మానించారు.

మహాసభ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

సిఐటియు మహాసభ జయప్రదానికి ప్రచారం

15న వాడవాడలా జెండా ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కార్మిక వర్గం హక్కులు కోసం అలుపెరుగని పోరాటం చేస్తున్న సిఐటియు 18వ అఖిల బారాత మహాసభలు డిసెంబర్ 31 నుండి 2026 జనవరి 4వరకు విశాఖ పట్నంలో జరుగుతున్నాయని, వాటిని జయప్రదం చేయాలని సిఐటియు నగర ఉపాధ్యక్షులు రెడ్డి శంకర్రావు, నగర కార్యదర్శి బి.రమణ పిలుపు నిచ్చారు. శుక్రవారం విజయ నగరం డాబాతోట క్రాంతి ట్రాన్స్‌పోర్టు కార్మికులతో జరిగిన కార్యక్రమం లో పోస్టర్ స్టిక్కర్ విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ 1885లో ప్రపంచ కార్మిక వర్గం పోరాడి 8 గంటల పని హక్కును సాధించు కున్నామని, నేడు బిజెపి నాయకత్వంలో ఎన్ డి ఎ ప్రభుత్వం 14 గంటలకు పెంచాలని కుట్ర చేస్తున్నదని అన్నారు. 29 కార్మిక చట్టాలు నేడు మోడీ ప్రభుత్వం రద్దుచేసి కార్మికద్రోహిగా మారిందన్నారు. ప్రభుత్వ రంగం లో ఉన్న విశాఖ స్టీల్ ప్రయివేట్ పరం చేసి పూర్తిగా రాష్ట్ర ప్రజలకి ద్రోహం చేస్తున్న నేపథ్యంలో జరుగుతున్న ఈ మహాసభ చాలా ప్రాధాన్యత కలిగినదన్నారు. ఈ నేపథ్యంలో కార్మిక ఐక్యతను చాటేందుకు ఈనెల 15న వాడవాడలా సిఐటియు జెండాలు ఎగురవేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి పి. రమణమ్మ మేస్త్రిలు సురేష్, తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 13,14తేదీల్లో ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు విజయనగరం, బొబ్బిలి రెండు డివిజన్లలో పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యా శాఖ అధికారి యు.మాణిక్యం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. పురుషులకు క్రికెట్ పోటీలు, మహిళలకు త్రోబాల్ పోటీలు నిర్వహిస్తామన్నారు. బొబ్బిలి డివిజన్‌కు సంబంధించి చీపురుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాల, బొబ్బిలిలో అర్ ఎస్ ఆర్ రంగారావు కాలేజీ మైదానంలోను, విజయనగరం డివిజన్‌కు సంబంధించి స్థానిక విజ్జి మైదానంలో పోటీలు జరుగుతాయని తెలిపారు. డిప్యూటీ డిఇఒలు కో ఆర్డినేటర్లుగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు.

24న జాతీయ వినియోగదారుల దినోత్సవం

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ఈ నెల 24న జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.సేధు మాధవన్ ఆదేశించారు. దీనిలో భాగంగా ఈ నెల 18 నుంచి వారోత్సవాలను నిర్వహించాలని సూచించారు. జాతీయ వినియోగదారుల దినోత్సవంపై తమ ఛాంబర్లో సంబంధిత అధికారులు, సభ్యులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ, డిజిటల్ న్యాయ పాలన ద్వారా సమర్థ సత్వర పరిష్కారం అన్న ఇతివృత్తంతో ఈ ఏడాది వినియోగదారుల వారోత్సవాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. పాఠశాల, ఇంటర్ విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీషులో వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహిస్తామని ప్రకటించారు. జిల్లా స్థాయిల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల క్రింద రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలు నగదు బహుమతులను అందజేస్తామన్నారు. ఈ పోటీల్లో మొదటి బహుమతులు సాధించినవారిని విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని చెప్పారు. వారోత్సవాల్లో భాగంగా వినియోగదారులకు అవగాహన కల్పించేవిధంగా ర్యాలీలు, ఫోటో ప్రదర్శనలను నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరా అధికారి జి.మురళినాథ్, డిఇఒ యు.మాణిక్యంనాయుడు, లీగల్ మెట్రాలజి డిసి బి.మనోహర్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ పి.వెంకటరమణ, వివిధ వినియోగదారుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు చదలవాడ ప్రసాద్, పిఎస్‌బి నాయుడు, ఎం.ఎస్. శ్రీనివాస రావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పిల్లలకు అండగా ఉంటాం

చిన్నారులను పరామర్శించిన డిఎల్ఎస్ఎ కార్యదర్శి కృష్ణప్రసాద్

ప్రజాశక్తి - జామి

అనిత కాలంలోనే తల్లి దండ్రులను కోల్పోయిన జన్నివలస గ్రామానికి చెందిన గౌతమ్, విజయ్ లను సీనియర్ సివిల్ జడ్జి, డిఎల్ఎస్ఎ కార్యదర్శి ఎ.కృష్ణ ప్రసాద్ కలిసి వారికి ధైర్యాన్ని ఇచ్చారు. ముందుగా పిల్లల యోగ క్షేమలను స్థానికులను అడిగి తెలుసుకుని వారికి మంచి భవిష్యత్ ఇవ్వడానికి ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేస్తుందని చెప్పారు. వారికి 'మిషన్ వాత్సల్య' పథకం కింద ఇద్దరికీ రూ. 4 వేల చొప్పున వారి అకౌంట్‌లో వేస్తామని తెలిపారు. సర్పంచ్ చంద్రినాయు

ప్రజాశక్తి
www.prajasakti.com

నేటి నుంచి జెఎన్‌టియుజివిలో సదస్సు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జెఎన్‌టియు జివి, జెన్ ఎఐ వర్సిటీ సంయుక్త ఆధ్వర్యాన 'జెన్ ఎఐ హ్యాక్‌థాన్ ఫర్ నెక్ట్స్ జనరేషన్ జాబ్స్' ప్రతిష్టాత్మకమైన సాంకేతిక కార్యక్రమం శనివారం ఉదయం 10గంటలకు ప్రారంభమవు తుందని వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ వి.వి. సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. భవిష్యత్ ఉద్యోగావకాశాల రూపకల్పనలో జనరేటివ్ ఎఐ కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. 48 గంటల పాటు జరిగే ఈ హ్యాక్‌థాన్ విద్యార్థులకు వాస్తవ ప్రపంచ సవాళ్లను ఎఐ ద్వారా పరిష్కరించే మార్గాలతో పాటు, పరిశ్రమ నిపుణులు, మెంటర్లు, ఆధునిక ఎఐ ఉపకరణాలతో ప్రత్యక్ష అనుభవం పొందడానికి ఒక అద్భుతమైన వేదిక కానుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బృందాల వారీ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్రంలోని వివిధ విద్యాసంస్థల నుండి సుమారు 680కి పైగా టీమ్‌లు, వెయ్యి మందికి పైగా విద్యార్థుల పాల్గొంటారని తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు లోకేష్

ప్రజాశక్తి- భోగాపురం

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న అంజూరు లోకేష్ అండర్-14 రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 16 నుంచి నెల్లూరు జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు పీడీ చిన్నారి, అసిస్టెంట్ పిఇటి రఘు తెలిపారు.

నెల్లిమర్ల : అండర్-14 రాష్ట్ర స్థాయి బీచ్ వాలీబాల్ పోటీలకు అలుగోలు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థి బి.గణేష్ ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా విద్యార్థిని హెచ్ఎం ఎల్.కస్తూరి, పీడీలు ధర్మారావు, మహేశ్వరరావు, స్టాఫ్ సెక్రటరీ నీలకంఠం, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రతి రైలులోనూ
సగం జనరల్ బోగీలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ప్రతి రైలులోనూ సగం జనరల్ బోగీలు ఏర్పాటు చేయాలని విజయనగరం రైల్వే మేనేజర్ ఎస్‌వివి రావుకు శుక్రవారం ఐక్యవేదిక నాయకులు చోడి ఆదినారాయణ, షణ్ముఖరావు, టివి దుర్గారావు, దిమిలి పైడ్రాజు వినతి అందజేశారు. పేద మధ్యతరగతి ప్రజలు రవాణా సౌకర్యం అయిన రైళ్లలో మూడు నాలుగు జనరల్ బోగీలు ఉండడం వలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రైల్వే స్టేషన్లో అమ్మే తిని బండారాలు నాసిరకంగా ఉన్నాయని, వాటిని తింటే ప్రజల ఆరోగ్యం పాడవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పేద మధ్యతరగతి ప్రజలకు రైల్వేను అందుబాటులో ఉంచాలని కోరారు.

సాయిగౌతమ్ పాఠశాలకు అరుదైన గౌరవం

ప్రజాశక్తి - గజపతినగరం



అవార్డు అందుకుంటున్న కరస్పాండెంట్ ఎస్ఎస్ నాయుడు

మండలంలోని సాయిగౌతమ్ పాఠశాలకు అరుదైన గౌరవం దక్కింది. గ్రామీణ ప్రాంతంలో ఉత్తమ విలువలతో కూడిన ఇన్నోవేటివ్ ఎడ్యుకేషన్ అందిస్తున్న పాఠశాలగా సాయిగౌతమ్ స్కూల్‌ను జాతీయ స్థాయిలో గుర్తించి హైదరాబాద్‌కు చెందిన ఎడ్యుటెక్, బ్రెయిన్ ఫీడ్ అనే సంస్థ అవార్డును అందజేసింది. హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో జరిగిన కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎస్ఎస్ నాయుడు ఈ అవార్డును స్వీకరించారు.

సచివాలయ సందర్శన

ప్రజాశక్తి-దత్తిరాజేరు

మండలంలోని కె.కృష్ణాపురం గ్రామ సచివాలయాన్ని ఐసిడిఎస్ పీడీ, మండల ప్రత్యేకాధికారి టి.విమలారాణి శుక్రవారం సందర్శించారు. కేంద్రంలో పనిచేసిన సిబ్బంది హాజరు, స్పందన, శానిటేషన్ రికార్డులను పరిశీలించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. ప్రజా వినతలును ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ నారాయణరావు పాల్గొన్నారు.

ఆయన నేత్రాలు సజీవం

ప్రజాశక్తి చీపురుపల్లి

అప్పారావు (ఫైల్)

చీపురుపల్లి పట్టణానికి చెందిన విశ్రాంత ఉద్యోగి కర్రోతు అప్పారావు (73) శుక్రవారం గుండెపోటుతో మరణించారు. ఆయన కుటుంబ సభ్యులు నేత్రదానానికి అంగీకరించడంతో రెడ్ క్రాస్ డివిజన్ చైర్మన్ బివి గోవిందరాజులు ఆధ్వర్యంలో కార్నియాలను సేకరించారు. వాటిని ఎల్‌వి ప్రసాద్ ఆసుపత్రికి పంపించారు. కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి వరహాల నాయుడు, గవిడి సురేష్, కరోతు రమణ, బివి గోవిందరాజులు పాల్గొన్నారు.

సెంట్రల్ బ్యాంకు ఎన్నికలకు సమాయత్తం కండి

ప్రజాశక్తి-చీపురుపల్లి

త్వరలో జరిగే సెంట్రల్ బ్యాంకు ఎన్నికలకు సమాయత్తం కావాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్మల్లిక్ నాయుడు పిఎసిఎస్ చైర్మన్లు, డైరెక్టర్లు, పార్టీ నాయకులకు సూచించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గంలోని పిఎసిఎస్ చైర్మన్లు, డైరెక్టర్లు, ఇతర కమిటీల చైర్మన్లు, సభ్యులతో ఆయన సమావేశమయ్యారు. నియోజకవర్గంలో 15 సొసైటీలు ఉన్నాయని, అన్ని సొసైటీలను గెలిపించి పార్టీకి కానుకగా ఇవ్వాలని కోరారు. సమావేశంలో టిడిపి మండలాల అధ్యక్షులు రౌతు కామనాయుడు, పైల బలరాం, తాడ్డి సన్యాసినాయుడు, ఆర్ఇసిఎస్ మాజీ చైర్మన్ దన్నాన రామచంద్రుడు, మాజీ వైస్ చైర్మన్ సారిపాక సురేష్, కనకమహాలక్ష్మి ఆలయ కమిటీ చైర్మన్ గవిడి నాగరాజు పాల్గొన్నారు.

కిసాన్ క్రెడిట్ కార్డులు అందజేస్తున్న పశువైద్యాధికారి, బ్యాంకు అధికారులు

కిసాన్ క్రెడిట్ కార్డుతో రుణాలు

ప్రజాశక్తి-వేపాడ

కిసాన్ క్రెడిట్ కార్డుతో పాడి రైతులకు తక్కువ వడ్డీకే రుణాలు ఇస్తున్నట్లు మండల పశువైద్యాధికారి గాయత్రీదేవి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పాడి రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వల్లంపూడి, బానాది, వీలుపర్తి, దబ్బిరాజుపేట గ్రామానికి చెందిన నలుగురు రైతులకు రూ.1.30 లక్షల రుణాలు మంజూరైనట్లు చెప్పారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

ప్రజాశక్తి-వేపాడ

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ తెలిపారు. మండలంలో జాకేరు, కరకవలస, సోంపురం గ్రామాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వాట్సాప్ గవర్నెన్స్ డోర్ టు డోర్ అవగాహన కార్యక్రమాన్ని పరిశీలించి, సిబ్బందికి సూచనలిచ్చారు. డ్రైడే డ్రైడేపై అవగాహన కల్పించాలని, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. అనంతరం సోంపురం ప్రభుత్వ పాఠశాల సందర్శించారు. ఉపాధి హామీ పనులను పరిశీలించి, కూలీలతో మాట్లాడారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ, ఎపిఒ ఆదిలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు కృష్ణ, ప్రభుదాసు, బోని గౌరి, మండల స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్ జి.రాంబాబు పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన

ప్రజాశక్తి-డెంకాడ

మండలంలోని రామస్వామిపేట, ముకుందపురం ప్రాథమిక పాఠశాలలను ఎంఇఒలు ఎన్.నాగభూషణరావు, పి.బాలభాస్కరరావు శుక్రవారం సందర్శించారు. ఇందులో భాగంగా పాఠశాల పరిసరాలు, కిచెన్ గార్డెన్, మధ్యాహ్న భోజన పథకం, తరగతి గది నిర్వహణను పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. పాఠశాల రికార్డులను తనిఖీ చేసి, సంతృప్తి వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.రమణమూర్తి, సిఆర్ఎంటి కె.రామప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమంగా కోటి సంతకాల సేకరణ

15న విజయనగరం జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ : వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి -కంటోన్మెంట్/డెంకాడ

ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రైవేటుపరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ వైసిపి చేపట్టిన కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమంగా మారిందని వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి ఆధ్వర్యంలో నియోజకవర్గాల్లో సేకరించిన సంతకాల పత్రాలు జిల్లా కార్యాలయానికి చేరుకున్నాయని, వాటిని గవర్నర్‌కు అందజేస్తామని తెలిపారు. కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ప్రజా ఉద్యమంగా మారిందన్నారు. జిల్లా కేంద్రాలు నుంచి పార్టీ కేంద్ర కార్యాలయానికి నియోజవర్గాల నుండి తరలివచ్చిన సంతకాల పత్రాలను ఈనెల 15న సోమవారం ఉదయం 10 గంటలకు విజయనగరం సిఎంఆర్ జంక్షన్ దగ్గర ఉన్న వైయస్సార్ విగ్రహానికి నివాళులర్పించి అక్కడినుండి కన్యకా పరమేశ్వరి ఆలయం మీదుగా మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి రాష్ట్ర కార్యాలయానికి తరలించే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శులు నెక్కల నాయుడు బాబు, కెవి సూర్యనారాయణ రాజు, జిల్లా ఉపాధ్యక్షులు సత్తిబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శులు



డెంకాడ.. మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు

వర్రి నరసింహ మూర్తి, రవికుమార్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు జైహింద్ కుమార్, జెడ్‌పిటిసి శీర అప్పలనాయుడు పాల్గొన్నారు.

డెంకాడ : ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి చేపట్టిన ప్రజా ఉద్యమంలో భాగంగా ఈ నెల 15న విజయనగరం భారీ ర్యాలీ చేపడుతున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం మండలంలోని పినతాడివాడ సర్పంచ్ లంక లక్ష్మణరావు నివాసం వద్ద వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త బడ్డుకొండ అప్పలనాయుడు అధ్యక్షతన నియోజకవర్గ నాయకులతో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా జిల్లాలో 4.50 లక్షల సంతకాలను సేకరించినట్లు తెలిపారు. ఈ క్రమంలో అత్యధికంగా 67 వేల సంతకాలను సేకరించి జిల్లాలో మొదటి స్థానంలో నెల్లిమర్ల నియోజకవర్గం నిలిచిందన్నారు. కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ పరిశీలకులు నెక్కల నాయుడుబాబు, మండలాల అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు, ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి, గదల సన్యాసినాయుడు, పిన్నింటి తమ్మినాయుడు, నెల్లిమర్ల పట్టణ అధ్యక్షులు చిక్కాల సాంబ, బిసి సెల్ జిల్లా అధ్యక్షులు మహంతి జనార్దన్, సీనియర్ నాయకులు కనక సింహాచలం, వైస్ ఎంపిపిలు చంటి రాజు, పతివాడ సత్యనారాయణ, సారిక వైకుంఠ, జోనల్ ఐటి ఇన్‌ఛార్జి బడ్డుకొండ మణిదీప్, యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షులు బడ్డుకొండ ప్రదీప్, ఎస్సి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు, అంగన్వాడీ విభాగం జిల్లా అధ్యక్షులు పతివాడ కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

గుర్లగెడ్డ ప్రాజెక్టు పోరాట కమిటీ ఫిర్యాదు

ప్రజాశక్తి- మెంటాడ

గుర్లగెడ్డ ప్రాజెక్టు ప్రధాన కట్ట కింద భూముల్లో ఎడమ కాలువ కప్పి వేసిన అప్పన్నరాజుపై చర్యలు తీసుకోవాలని గుర్లగెడ్డ ప్రాజెక్టు పోరాట కమిటీ సభ్యులు శుక్రవారం ఎఎస్ఆర్ జిల్లా అనంతగిరి మండలం రొంపిల్లి సచివాలయంలో ఫిర్యాదు చేశారు. రొంపిల్లి రెవెన్యూ పరిధిలో గుర్లగెడ్డ ప్రాజెక్టు కోసం పాతికేళ్ల క్రితం సేకరించిన భూమిని విజయనగరానికి చెందిన ధనిక రైతు అప్పన్నరాజు ఎటోర్ సిటీ వెంచర్ యాజమాన్యం కలిసి చదును చేసి, ఎడమ కాలువ కప్పి వెంచర్ వేస్తున్నట్లు తెలిపారు. పది రోజుల నుంచి కబ్జా చేస్తున్నారని, ఆక్రమణ పనులు నిలిపివేయకపోతే 10 గ్రామాలకు చెందిన ప్రాజెక్టు ఆయకట్టు భూములు బీడుగా మారే పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తంచేశారు. తక్షణమే అధికారులు చొరవ తీసుకొని కబ్జాదారులపై తగు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో గుర్లగెడ్డ ప్రాజెక్టు పోరాట కమిటీ కార్యదర్శి రాకోటి రాములు, జెవివి నాయకులు గండ్రే లక్ష్మణరావు, గండ్రేటి అప్పలనాయుడు, కమిటీ సభ్యులు పి.అప్పలనాయుడు, చెరకాన రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

వినతి అందిస్తున్న గుర్లగెడ్డ ప్రాజెక్టు పోరాట కమిటీ సభ్యులు

గ్రామ అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే లోకం నాగమాధవి

ప్రజాశక్తి-దెంకాడ

కొండరాజుపేట గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే లోకం నాగ మాధవి తెలిపారు మన ప్రజలతో మన ఎమ్మెల్యే కార్యక్రమాన్ని మండలంలోని కొండరాజుపేటలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలో పర్యటించారు. గ్రామస్తులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. పరిశీలించిన వాటిని వెంటనే పరిష్కరించాలని, పరిష్కారం కాని వాటిని తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. మరికొన్ని సమస్యలకు నిధులు మంజూరుకు అంచనా వేసి పంపాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ భూమిపై తక్షణ విచారణకు రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అర్హులైన పేదలకు గృహ స్థలాలను కేటాయించేలా చూస్తానని హామీనిచ్చారు. తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. గ్రామంలో పెండింగ్‌లో ఉన్న 20 అభివృద్ధి పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.

పల్లెల ప్రగతే కూటమి ధ్యేయం

భోగాపురం : మండలంలోని రామచంద్రపేటలో శుక్రవారం ఎమ్మెల్యే లోకం నాగ మాధవి పర్యటించారు. అభివృద్ధి పనులను

మాట్లాడుతున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి

ప్రారంభించారు. జిఎంఆర్, ఎల్‌అండ్‌టి సంస్థల సహకారంతో నిర్మించిన తాగునీటి ప్లాంట్, నూతన అంగన్వాడీ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పల్లెల ప్రగతే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. రామచంద్రపేట నుంచి కొండరాజుపాలేనికి వెళ్లే తారురోడ్డును రూ.30 లక్షలతో నిర్మించినట్లు చెప్పారు. కాలువల నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు తెలిపారు. గ్రామంలో మూడు ఆలయాల నిర్మాణానికి దాతల నుంచి సేకరించిన నగదును గ్రామ పెద్దలకు అందచేశారు. కార్యక్రమంలో మట్టా అయ్యప్ప రామకృష్ణారెడ్డి, మైలపల్లి అప్పలకొండ, వందనాల రమణ, పల్లంట్ల జగదీష్ పాల్గొన్నారు.

ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవం

ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ బొబ్బిలి తాలూకా నూతన కార్యవర్గం

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక ఎన్‌జిఒ హోంలో శుక్రవారం నిర్వహించిన ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ బొబ్బిలి తాలూకా ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. నూతన అధ్యక్షులుగా బి.బలరామ్ నాయుడు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా కె.రామారావు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా పి.పార్థసారథిరావు, పి.వీరరాజు, పి.శంకర రావు, కార్యదర్శిగా చుక్క శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీలుగా పి.విక్రమ ధర్మతేజ, ఎం.రాజేష్, ఎం.భానుమూర్తి, బి.ప్రసాద్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎస్.శ్రీహరి, మహిళా ఉపాధ్యక్షులుగా కె.రమణమ్మ, మహిళా జాయింట్ సెక్రటరీగా కె.సుజాత ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా ఎ.ప్రవీణ్ కుమార్ వ్యవహరించారు ఈ సందర్భంగా ఉద్యోగులతో మెయిన్ రోడ్‌లో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు టి.శ్రీధర్‌బాబు, కార్యదర్శి ఎ.సురేష్, రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు ఆర్.రామ్మూర్తి, మాజీ అధ్యక్షులు చుక్క మహంతి నాయుడు, మన్యం జిల్లా అధ్యక్షులు కిశోర్, ఉపాధ్యక్షులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

14న జిల్లా ఖోఖో జట్లు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 14న నెలాఖరున జరిగే రాష్ట్ర పోటీలకు జిల్లా సీనియర్, జూనియర్ స్త్రీ,పురుష జట్లు ఎంపిక నిర్వహిస్తామని జిల్లా ఖో ఖో అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు, అధ్యక్ష, కార్యదర్శులు పి.విజయలక్ష్మి, ఎఎంఎల్ కమలనాభరావు, కె.గోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ ఎంపికలకు 2008 జనవరి 1తరువాత పుట్టిన వారు అర్హులని తెలిపారు.

శ్మశానవాటికను అభివృద్ధి చేయాలని వినతి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

రామతీర్థం కోవెలవీధి శ్మశానవాటిక అభివృద్ధి చేయాలని స్థానికులు శుక్రవారం సర్పంచ్‌కి, పంచాయతీ కార్యదర్శి శ్రీదేవికి వినతి పత్రం అందజేశారు. రహదారి లేదని, మార్గం మధ్యలో లోతైన కాలువ దాటుకుని వెళ్లడం దుస్సాహసమే అవుతోందని తెలిపారు.

ఎంపిపిగా బాధ్యతలు స్వీకరిస్తున్న భాస్కరరావు

బాడంగి ఎంపిపిగా భాస్కరరావు

ప్రజాశక్తి-బాడంగి

బాడంగి ఎంపిపి బాధ్యతలను వైస్ ఎంపిపి సింగిరెడ్డి భాస్కరరావు శుక్రవారం స్వీకరించారు. ఎంపిపి గౌరిపై టిడిపి ఎంపిటిసిలు అవిశ్వాస తీర్మానం పెట్టడం, ఇద్దరు వైసిపి ఎంపిటిసిలు కూడా మద్దతు ఇవ్వడంతో అవిశ్వాస తీర్మానం నెగ్గింది. ఎంపిపి పదవి ఎస్సీ రిజర్వు కావడంతో బొత్సవానివలస ఎంపిటిసి లక్ష్మిని ఆ పదవి వరిస్తుందని భావించారు. ఇలాంటి పరిస్థితుల్లో ఇన్‌ఛార్జి ఎంపిపిగా బాధ్యతలను వైస్ ఎంపిపి భాస్కరరావుకు అప్పగిస్తూ జెడ్‌పి సిఇఒ నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు ఎంపిడిఒ రామకృష్ణ తెలిపారు. దీంతో ఎంపిపి ఎన్నిక మరి లేనట్లేనని సమాచారం.

ప్రజల వద్దకెళ్లి సమస్యలు తెలుసుకోవాలి

ప్రజాశక్తి - జామి

అధికారులు ప్రజల వద్దకు వెళ్లి, సమస్యలు తెలుసుకొని, పరిష్కరించాలని మండల ప్రత్యేకాధికారి శారదాదేవి తెలిపారు. నూతన మండల ప్రత్యేకాధికారిగా డ్వామా పీడీ శారదాదేవి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మండల అధికారులతో సమీక్షించారు. మండలంలో ప్రతి శాఖకు సంబంధించిన పిజిఆర్ఎస్ ఫిర్యాదులు, శాఖల పనితీరును అడిగి తెలుసుకున్నారు. జామి-1,2,3, కుమరం సచివాలయాలను సందర్శించి, రికార్డులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ప్రతి శుక్రవారం వాట్సాప్ గవర్నెన్స్‌ను ప్రతి ఇంటికి వెళ్లి సర్వే చేయాలని ఆదేశించారు. ప్రతి ఉద్యోగి ప్రతిరోజూ క్షేత్రస్థాయికి వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో తహశీల్దార్ కృష్ణంరాజు, ఎంపిడిఒ నీలం అప్పలనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ అవినీతిపై చర్యలు తీసుకోవాలని ధర్నా

ప్రజాశక్తి -బొబ్బిలి

మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతిపై సమగ్ర దర్యాప్తు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అంబేద్కర్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు సోరు సాంబయ్య డిమాండ్ చేశారు. అవినీతిపై దర్యాప్తు చేయాలని శుక్రవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. మున్సిపల్ సాధారణ నిధుల ఖర్చులో అక్రమాలకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. పనులు చేయకుండా, చేతిపంపు బోర్లు వేయకుండా బిల్లులు చేసుకుని ప్రజాధనాన్ని స్వాహా చేస్తున్నారని తీవ్ర ఆరోపణలు గుప్పించారు. కమిషనర్ కారుకు మున్సిపల్ ఉద్యోగిని డ్రైవర్‌గా పెట్టుకుని మున్సిపాలిటీ నిధుల నుంచి జీతాలు చెల్లించి కారు అద్దెను స్వాహా చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఎం. శ్రీనివాస్, కోట అప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

ట్రైసైకిల్ అందజేత

ప్రజాశక్తి కొత్తవలస

నరపాం గ్రామానికి చెందిన వికలాంగుడు ఇటకర్లపల్లి అవతారానికి సుబ్బలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రైసైకిల్‌ను శుక్రవారం అందజేశారు. డి.విజయలక్ష్మి ఆర్థిక సాయంతో ట్రైసైకిల్ అందించినట్లు ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షులు కనకాల శివ తెలిపారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు కోళ్ల వెంకటరమణ, బంగారు రమేష్, బొబ్బిలి సత్యనారాయణ, వెంకటరమణ పాల్గొన్నారు.

14 నుంచి ఇంధన పొదుపు వారోత్సవాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రతి ఒక్కరు ఇంధన పొదుపును ఉద్యమంగా చేపట్టాలని అధికారులను ఆ శాఖ చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్ పిలుపునిచ్చారు. ఈ నెల 14 నుంచి ప్రారంభమయ్యే ఇంధన పరిరక్షణ వారోత్సవాలకు సంబంధించిన గోడపత్రికలను శుక్రవారం విశాఖ సాగర్‌నగర్‌లో సిఒఇటి భవనంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో డిసెంబర్ 14 నుంచి 20 వరకు ఇంధన పరిరక్షణ వారోత్సవాలను భారీ స్థాయిలో నిర్వహించి ప్రజల్లో ఇంధన పొదుపుపై అవగాహన పెంపొందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎపిఇపిడిసిఎల్ సిఎండి పృథ్వీ తేజ్, నెడ్‌కాప్ ఎమ్‌డి ఎం.కమలాకరబాబు, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్లు కె.విజయ, ఎస్. రామసుందర రెడ్డి, స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్.ప్రభాకర రెడ్డి, ఇపిడిసిఎల్ డైరెక్టర్లు టి.వి. సూర్యప్రకాష్, టి.వనజ, ఎస్.హరిబాబు, సిజిఎంలు, ఎల్.దైవప్రసాద్, వి.విజయలలిత, బి.అశోక్ కుమార్, పి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన మహిళను ఆసుపత్రికి తరలించిన ఎస్పి

ప్రజాశక్తి -కంటోన్మెంట్

గుర్ల గ్రామానికి దగ్గరలో రాత్రి సుమారు 7 గంటల సమయంలో బైక్ ప్రమాదానికి గురై, తీవ్రంగా గాయపడిన ఒక మహిళను జిల్లా ఎస్పి ఎఆర్ దామోదర్ ఆస్పత్రికి తరలించారు. గరివిడిలో జరిగిన అభ్యుదయం సైకిల్ యాత్ర కార్యక్రమంలో పాల్గొని తిరిగి విజయనగరం వస్తున్న సమయంలో గుర్ల గ్రామం దగ్గర దుగ్గివలస గ్రామానికి చెందిన దంపతులు బైకుపై విజయనగరం నుండి దుగ్గివలస వస్తున్న సమయంలో బైకు ప్రమాదానికి గురై రహదారిపై పడిపోయారు. వెనుక కూర్చున్న మహిళ తీవ్రంగా గాయపడింది.

అటుగా వస్తున్న ఎస్పి గమనించి గాయపడిన మహిళకు సపర్యలు చేసి, మంచినీరు అందించి, ఆమెకు, తన భర్తకు ధైర్యం చెప్పి వెంటనే అటుగా వస్తున్న ఆటోను ఆపి ఆటోలోకి స్వయంగా ఎక్కించి దగ్గరలో ఉన్న నెల్లిమర్ల మిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఎస్పి వెంట ఎస్‌బి సిఐ ఎ.వి.లీలారావు కూడా వున్నారు. అనంతరం స్థానిక ఎస్ఐకు, సిఐకు సమాచారం అందించి వెంటనే తదుపరి చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

వైద్య సేవలు సద్వినియోగం చేసుకోండి

డిఎల్ఎస్ఎ సెక్రటరీ కృష్ణప్రసాద్

ప్రజాశక్తి-విజయనగరంకోట

యూనివర్సల్ హెల్త్ కవరేజ్‌లో భాగంగా ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను వినియోగించుకోవాలని డిఎల్ఎస్ కార్యదర్శి డాక్టర్ ఎ.కృష్ణప్రసాద్ అన్నారు. పుష్పగిరి కంటి ఆసుపత్రిలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన న్యాయ అవగాహన సదస్సుకు కృష్ణ ప్రసాద్ ముఖ్యఅతిథిగా విచ్చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనివర్సల్ హెల్త్ కవరేజ్‌లో భాగంగా ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలు గురించి, వాటిని ఎలా ఉపయోగించుకోవాలో అవగాహన కలిగించారు. న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అందిస్తున్న ఉచిత న్యాయ సేవలు కూడా ప్రజలు వినిగించుకోవాలని తెలిపారు.

అనంతరం పుష్పగిరి హాస్పిటల్ ని సందర్శించి రోగుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సిహెచ్ రాజేశ్వరరావు, చీఫ్ ఫైనాన్స్ ఆఫీసర్ డి.మురళీ, డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినే